వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ నవంబర్ 30 శనివారం 2024
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 125



2లో

**బోనస్ వల్ల కష్టపడే రైతులకే ఫలితం దక్కుతుంది**

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## నాడూ.. నేడూ.. కాంగ్రెస్‌ది
# తప్పుడు విధానమే

- వచ్చే నాలుగేళ్లు ప్రజల కోసం పోరాటం
- తెలంగాణ చరిత్రలో కేసీఆర్ హిమాలయ పర్వతం
- కరీంనగర్ దీక్షాదివస్‌లో కేటీఆర్

తెలంగాణ విషయంలో నాడు.. నేడూ కాంగ్రెస్ పార్టీ తప్పుడు విధానాన్నే అవలంబిస్తోందని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్ అనిపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా అలుగునూరు చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోని పరిస్థితుల కారణంగా మరోసారి పోరాట బాట పట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కృషి అనన్య సామాన్యమైనదని కేటీఆర్ కొనియాడారు. కేసీఆర్ పదవులు ఆశించకుండా తెలంగాణ కోసం కృషి చేశారని తెలిపారు. కేసీఆర్ అనేది పేరు కాదు.. తెలంగాణ పోరు అని పేర్కొన్నారు. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధించామని తెలిపారు. కానీ ఆనాడు ఉద్యమంలో అడ్రస్ లేని వాళ్లు ఇవాళ తెలంగాణ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆనాడు ఉద్యమంలో మన మీదకు తుపాకీ తీసుకొచ్చినోడు ఇవాళ మాట్లాడుతున్నాడని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే మీరు నాంపల్లి దర్గా దగ్గర అడుక్కుతినే వాళ్లని తెలంగాణ ప్రజల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ఇవాళ అదృష్టవంతుడు.. అధికారం ఆయన దగ్గర ఉందని కేటీఆర్ అన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో
# నిరుపేదలకే ప్రాధాన్యం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యం ఇచ్చి కేటాయింపులు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రధానంగా దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమి లేనివారు, పారిశుద్ధ్య కార్మికులు.. ఈ తరహా ప్రాధాన్య క్రమంలో ఎంపికలు ఉండాలని పేర్కొన్నారు.



హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యం ఇచ్చి కేటాయింపులు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రధానంగా దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమి లేనివారు, పారిశుద్ధ్య కార్మికులు.. ఈ తరహా ప్రాధాన్య క్రమంలో ఎంపికలు ఉండాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గృహనిర్మాణ శాఖపై శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఎం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. తొలి దశలో సొంత స్థలాలున్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ విషయంలో గ్రామ కార్యదర్శి, మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయడంతోపాటు అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌లో సాంకేతిక లోపాలేవీ లేకుండా చూడాలని, ఏ దశలోనూ లబ్ధిదారులకు ఇబ్బందులు కలగొద్దని, శాఖా పరంగా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని సూచించారు. రాష్ట్రంలో ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక కోటా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా గదులు కట్టుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపితే అనుమతి ఇవ్వాలని అధికారులకు స్పష్టంచేశారు. ఇందిరమ్మ ఇళ్ల నమూనాలు రెండింటిని సిద్ధం చేయగా.. ఈ అంశం సమీక్షలో చర్చకు వచ్చింది. ఏ నమూనాను ఖరారు చేయాలనే అంశంపై ఒకటి, రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకోవాలనే అంచనాకు ప్రభుత్వం వచ్చినట్లు సమాచారం. సమీక్షలో సీఎంవో ముఖ్యకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ పాల్గొన్నారు.



**యూపీలో దారుణం.. నర్సుపై సామూహిక అత్యాచారం**

2 లో



**అదుపు తప్పి హైవే బ్రిడ్జి అంచుకు ఆర్టీసీ బస్సు**

2 లో



**పెద్దపులి దాడిలో మహిళ మృతి**

2 లో




**దుబాయ్ లా భారత్‌లో టాక్స్ ఫ్రీ స్టేట్**

2 లో

## లగచర్లలో బహుళార్థ పారిశ్రామిక పార్కు భూసేకరణకు నోటిఫికేషన్

వికారాబాద్: బహుళార్థ పారిశ్రామిక పార్కు భూసేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దుద్యాల మండలంలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈక్రమంలో మండలంలోని లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాల భూసేకరణ కోసం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. రైతులు, స్థానికుల ఆందోళనల నేపథ్యంలో అంతకుముందు ఇక్కడ ఫార్మా విలేజ్‌ల కోసం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను ఇటీవల ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.




# ఐక్యతే మన ఆయుధం..




- పార్టీలో క్రమశిక్షణ చాలా అవసరం
- ఎట్టి పరిస్థితుల్లోనూ అందరం ఐక్యంగా ఉండాలి
- పార్టీ విజయమే తమ గెలుపుగా భావించాలి
- పార్టీ బలంపైనే మన శక్తి ఆధారపడి ఉంటుంది
- మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఆశించినట్లుగా లేవు
- ఇది భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారతుంది
- పార్టీ బలోపేతానికి కఠిన నిర్ణయాలు తప్పవు
- ఈవీఎంలపై పలు అనుమానాలు ఉన్నాయి
- కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక నిర్ణయాలు

ఎట్టి పరిస్థితుల్లోనూ అందరం ఐక్యంగా ఉండాలి. ఇదే మన ఆయుధం. పార్టీ విజయమే తమ గెలుపు అని ప్రతి ఒక్కరూ అనుకోవాలి. పార్టీ బలంపైనే మన శక్తి ఆధారపడి ఉంటుందని భావించాలి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పనితీరుతో నూతనోత్సాహంతో పునరాగమనం చేసింది.

## దేశాన్ని ప్రైవేటుపరం చేసేందుకు
# మోదీ కుట్ర

దేశాన్ని ప్రైవేటుపరం చేసేందుకు ప్రధాని మోదీ కుట్ర చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్లలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు.



హైదరాబాద్: దేశాన్ని ప్రైవేటుపరం చేసేందుకు ప్రధాని మోదీ కుట్ర చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్లలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఛైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ అధ్యక్షతన శుక్రవారం గాంధీభవన్ ఆవరణలోని ఇందిరాభవన్‌లో ఆ విభాగం రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఏఐసీసీ కార్యదర్శి, సంఘటన్ జాతీయ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్, కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని, ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ధనవంతులు, కార్పొరేట్ల కోసం భాజపా పని చేస్తోందని విమర్శించారు. అంబానీ, అదానీ లాంటి వారిని మోదీ పెంచి పోషిస్తున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సర్కార్ చేసిన రూ.లక్షల కోట్ల రుణాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తుందన్నారు. ప్రజా పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, చేసిన పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని కార్యకర్తలను కోరారు. కాంగ్రెస్ పార్టీలో పంచాయతీరాజ్ సంఘటన్‌కు పాముఖ్యత ఉందని, రాజీవ్‌గాంధీ, రాహుల్‌గాంధీలకు ఈ విభాగం అంటే ప్రత్యేక అభిమానమన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. రాహుల్‌ను ప్రధానిని చేసేవరకు ప్రతి కార్యకర్తా కష్టపడాలన్నారు. హర్షవర్ధన్ సప్కాల్ మాట్లాడుతూ..సంఘటన్ గతంలో కంటే బలోపేతమైందని, మరింత పటిష్ఠం కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వెయ్యి మంది సర్పంచులతో వర్క్‌షాప్ నిర్వహించాలని సూచించారు.

# కెసిఆర్ దొంగ దీక్షతో రాష్ట్రం రాలేదు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 29**

: కెసిఆర్ దొంగ దీక్ష వల్ల తెలంగాణ రాలేదని, సోనియా గాంధీ దయతోనే తెలంగాణ వచ్చిందని రాష్ట్ర రోడ్డు, సినీ ఆటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కాలేశ్వరం కమిషన్ల కోసమే కెసిఆర్ కట్టాడని ఆయన విమర్శించారు. దొంగ దీక్షలు చేసిన కేసీఆర్ దీక్ష దివస్ పేరుతో రాజకీయాలు చేస్తున్నారని, రాష్ట్రాన్ని దోచుకున్న బావ, బామ్మర్దులు మరోసారి రాష్ట్రాన్ని దోచుకోవడానికి వస్తున్నారని, ప్రజలు వారి మాటలు నమ్మవద్దని ఆయన అన్నారు. సోనియా గాంధీ పుట్టిన రోజు వరకు ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభిస్తామని, సొంత స్థలం ఉన్నవారికి ఐదు లక్షలు రూపాయలు విడుదల చేస్తామని ఆయన తెలిపారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో శుక్రవారం డబుల్ రోడ్డు పనులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు, సినీ ఆటోగ్రఫీ శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తో కలిసి 8 కోట్ల రూపాయల డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పాత గురడి రెడ్డి సంఘంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి డాక్టర్ గా సేవలందించిన ఒక మంచి వ్యక్తిని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రూరల్ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే కోరిక మేరకు 250 కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయిస్తామని హామీ ఇచ్చారు.రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ, తమ నియోజకవర్గ అభివృద్ధికి 250 కోట్లు రూపాయల నిధులు ఇవ్వాలని, తద్వారా నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హంధాన్, ఐసిడిఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, మండలాధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్, సొసైటీ చైర్మన్లు చెలిమెల చిన్నారెడ్డి, వెంకన్న గారి జనార్దన్ రెడ్డి, నాయకులు చెలిమెల నర్సయ్య, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఇందల్వాయి కిషన్ తో పాటు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**సోనియా గాంధీ దయతోనే తెలంగాణ. రాష్ట్ర రోడ్డు, సినీ ఆటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.**

వేగుచుక్క

# యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మతు పనులు

**రోడ్లు-భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష.**






**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 29**

భారీ వర్షాలకు రాష్ట్రంలోని ఆయా జిల్లాలలో దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి ప్రజా రవాణ వ్యవస్థకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఎక్కడ కూడా రోడ్లపై గుంతలు లేకుండా ఆధునిక సాంకేతిక పద్ధతులలో మరమ్మతులు చేపడుతుండడం వల్ల చాలాకాలం పాటు రహదారులు మన్నికగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని అన్నారు. నిజామాబాద్ జిల్లా రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అధికారులతో జిల్లా ప్రగతిపై సమీక్ష జరిపారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల నిర్మాణాలు, ఆర్ ఓ బీ పనుల ప్రగతి, ధాన్యం సేకరణ, రైతులకు బిల్లుల చెల్లింపులు, మిషన్ భగీరథ నీటి సరఫరా తదితర అంశాలపై సమీక్ష నిర్వహించిన మంత్రి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రగతికి చిహ్నంగా నిలిచే రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అధికారులకు హితవు పలికారు. ఇందల్వాయి - భీంగల్ రోడ్డును రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. అటవీ అనుమతుల పేరుతో పనులను పెండింగ్ లో పెట్టడం సరికాదని అన్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాలలో సుదీర్ఘ కాలం నుండి కొనసాగుతున్న ఆర్ఓబీ పనులను కూడా త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ - జగిత్యాల, జగిత్యాల నుంచి మంచిర్యాల రోడ్డు నిర్మాణంపై దృష్టి సారిస్తామని, మద్నూర్ - భోదన్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి వారం రోజుల్లో సమగ్ర ప్రతిపాదనలు తనకు పంపించాలని, దానిని జాతీయ రహదారుల సంస్థకు పంపించి మంజూరీలు తెప్పిస్తానని మంత్రి అధికారులకు సూచించారు.

సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సైతం సన్న బియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించినందున రైతులు సన్నధాన్యం సాగు చేసేలా వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించాలని సూచించారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.**

ఇందల్వాయి మండలం నల్లవెల్లిలో రూ. 22 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ. 4 కోట్ల వ్యయంతో చేపడుతున్న నల్లవెల్లి నుండి మంగ్యానాయక్ తండా రోడ్డుకు, రూ. 18 కోట్లతో చేపడుతున్న నల్లవెల్లి నుండి గౌరారం వెళ్లే రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ధర్పల్లి లో రూ. 8 కోట్ల నిధులతో చేపట్టనున్న ధర్పల్లి నుండి ఇందిరానగర్ విగ్రహం వరకు గల రోడ్ పనులకు, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వినాయక్ నగర్ నుండి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే టి.లక్ష్మీకాంత్ రావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఎఫ్ఓ వికాస్ మీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి సైన్స్ ఫేర్ లో దివ్యాంగుల ప్రతిభ

**హర్షం వ్యక్తం చేసిన స్నేహ సొసైటీ నిర్వాహకులు.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 29:**

విజన్ ఏంపవర్మెంట్ జాతీయస్థాయిలో ఏర్పాటుచేసిన సైన్స్ ఫేర్ లో ప్రతిభ కనబరిచి, జిల్లా ఖ్యాతిని నలు దిశల చాటి చెప్పడం ఎంతో సంతోషంగా వుందని స్నేహ సొసైటీ నిర్వాహకులు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు దివ్యాంగులైనప్పటికీ ప్రతి విద్యార్థిని, విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించే ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారని వారు తెలిపారు.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతీ నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో జాతీయ స్థాయిలో విజన్ ఏంపవర్మెంట్ వారు ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్ తమ పాఠశాలకు చెందిన ఆస్మా అనే అంద విద్యార్థిని జాతీయస్థాయిలో విత్తనాలు మొలకెత్తడం అనే అంశంపై ప్రదర్శించి, క్లుప్తంగా వివరించి అవార్డులు కైవసం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు. అందులో ఉభయ తెలుగు రాష్ట్రాలలో కెల్లా ఆస్మా తన నైపుణ్యాన్ని ఇతర రాష్ట్రాల నుండి ఇతర భాషల్లో విద్యార్థులతో సైతం పోటీపడి గెలుపొందడం జిల్లాకే గర్వకారణమని తెలిపారు. అలాగే నవంబర్ మాసంలో జరిగిన జిల్లా స్థాయి మానసిక దివ్యాంగుల క్రీడా పోటీల్లో సైతం భవిత, సాయి జాహ్నవి అక్షయ చెస్, షాట్ పుట్, రన్నింగ్ పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. మానసిక దివ్యాంగులు అని చిన్న చూపు చూడకుండా జిల్లా పాలన యంత్రాంగం, జిల్లా సంక్షేమ అధికారులు ప్రతి ఒక్కరి సహకారంతో విద్యార్థుల నైపుణ్యాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపు రావడానికి కృషి చేశారనీ కృతజ్ఞతలు తెలియజేశారు. తల్లిదండ్రులకు కూడా తమ పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన విద్యార్థులకు స్నేహ సొసైటీ తరపున నగదుకు ప్రోత్సాహాన్ని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి ఎస్ సిద్దయ్య, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రయో ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్‌తో ఆరోగ్యకర దేశ నిర్మాణం



**ప్రోటీన్ల ఛాయాచిత్రాలతో వ్యాధి నిరోధక డ్రగ్స్ తయారీ సులభం.**

**అమెరికా హెల్త్ సైన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ డా.వెంకట ప్రసాద్ దాండ్లి.**

**టియులో ప్రోటీన్ల నిర్మాణంలో క్రయో ఎలక్ట్రానిక్స్ మైక్రోస్కోపీ పాత్ర పై వర్క్ షాప్.**



**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, నవంబర్ 29:**

ప్రోటీన్ల ఛాయాచిత్రాలను తెలుసుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తిని పెంచే అనేక రాకలైన డ్రగ్స్ ను సులభంగా తయారు చేయవచ్చునని అమెరికా నార్త్ కరోలిన్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఎన్విరాన్మెంటల్ హెల్త్ సైన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ డా.వెంకట ప్రసాద్ దాండ్లి పేర్కొన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రోటీన్ల నిర్మాణ విశ్లేషణలో క్రయో ఎలక్ట్రాన్ మైక్రో స్కోపి పాత్ర అనే అంశం పై శుక్రవారం విభాగాధిపతి డాక్టర్ ప్రసన్న శీల అధ్యక్షతన వర్కుషాప్ నిర్వహించారు. వర్క్ షాప్ ప్రారంభకులుగా కళాశాల ప్రధానాచార్యులు, ఆచార్య సిహెచ్ ఆరతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మా ఊరపు సత్యనారాయణ రెడ్డి హాజరయ్యారు.

ఈ వర్క్ షాప్ కు కీలక ఉపన్యాసకర్త గా హాజరైన అమెరికా నార్త్ కరోలిన్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఎన్విరాన్మెంటల్ హెల్త్ సైన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ డా.వెంకట ప్రసాద్ దాండ్లి ప్రోటీన్ల నిర్మాణ విశ్లేషణలో క్రయో ఎలక్ట్రానిక్ మైక్రోస్కోపీ ఉపయోగాలను వివరించారు. పరిశోధక విద్యార్థుల కు తక్కువ ఖర్చుతో క్రయో ఎలక్ట్రాన్ ను ఉపయోగించి ఉపాధి అవకాశాలు ఎలా సృష్టించుకోవాలో తెలియజేశారు. నిజజీవితంలో క్రయో ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్ ఉపయోగాలపై విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమగ్రంగా సమాధానమిచ్చారు. అభివృద్ధి చెందుతున్న భారత దేశంలో క్రయో ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్ ని విస్తృతంగా వాడవచ్చునని దీని ఉపయోగం వలన ఆరోగ్యకరమైన దేశాన్ని నిర్మించవచ్చునని పేర్కొన్నారు.

**జూమ్ లింకుతో విద్యార్థుల వీక్షణ.**

ఈ కార్యక్రమాన్ని జూమ్ లింకు ద్వారా తెలంగాణ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల విద్యార్థులు వీక్షించినట్టు వర్క్ షాప్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న శీల తెలిపారు. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ, బోటనీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫార్మాసూటికల్ కెమిస్ట్రీ ఆచార్యులు డాక్టర్ ప్రవీణ్ మామిడాల, డాక్టర్ మహేందర్ రెడ్డి, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ బోయపాటి శిరీష, డా. ప్రసన్న తో పాటు విశ్వవిద్యాలయ ఆచార్యులు పాల్గొన్నారు.

# నేడు ప్రభుత్వ పాఠశాలల బంద్

**విజయవంతానికి వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 29:**

వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ప్రభుత్వ పాఠశాల బంద్ కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. జిల్లాలో బంద్ ను విజయవంతం చేయాలని పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి ఫుడ్ పాయిజన్ తో 51 మంది విద్యార్థులు చనిపోయారని, ముఖ్యంగా గురుకుల, కేజీవిపి, ఆశ్రమ పాఠశాలు, ప్రభుత్వ స్కూల్స్ లో తరచుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. నాణ్యమైన పోషక ఆహారం పెట్టడటం లేదని, సంబంధిత విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించణ కరువైందని అన్నారు. ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సరైంది కాదని, ఫుడ్ పాయిజన్ తో చనిపోయిన విద్యార్థులకు ఎక్స్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. బంద్ కి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు

**ఏడాది పాలనలోనే కాంగ్రెస్ నిజస్వరూపం బట్టబయలు.**
**వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే.**
**దీక్ష దివస్ లో మాజీ ఎమ్మెల్సీ పారుఖ్ హుస్సేన్, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 29:**

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాధ్యమైందని మాజీ ఎమ్మెల్సీ, దీక్షా దివస్ జిల్లా ఇన్చార్జి ఫారూక్ హుస్సేన్, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ నేత, బీఆర్ఎస్ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర సాధన కోసం చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను గుర్తు చేసుకుంటూ బీఆర్ఎస్ పార్టీ శుక్రవారం దీక్ష దివస్ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం చేపట్టిన దీక్ష కార్యక్రమంలో ఈ సందర్భంగా దీక్ష దివస్ ఫారూఖ్ హుస్సేన్, ప్రశాంత్ రెడ్డి మాట్లాడారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ అన్ని పార్టీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లారన్నారు. చాలామంది అమ్ముడుపోతారంటూ ఆరోపణలు చేశారని, కానీ కేసీఆర్ అమ్ముడుపోయే మనిషి కాదన్నారు. ఇప్పుడు వచ్చిన రేవంత్ కూడా అదే మోసపు మాటలతో తెలంగాణ ప్రజలను వంచిస్తూ మోసపు హామీలను ప్రకటిస్తూ తెలంగాణను దోచుకుంటున్నారని ఆరోపించారు. కేవలం తన సొంత జిల్లాల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నారని మిగితా జిల్లాల అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాలం చెల్లిందని, మళ్ళీ రాబోయేది కేసీఆర్ పాలనేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆటోడ్రైవర్ల నుంచి రైతన్నల వరకు కష్టాలు పెడుతూ వారికి ఎలాంటి సంక్షేమ పథకాలు అందివ్వకుండా కనీసం వృద్ధులకు పెన్షన్లు అందివ్వని అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రతిసారి బీఆర్ఎస్ పార్టీ ఖతం అవుతుందంటూ మాట్లాడుతున్నాడని, తమ పార్టీని ఖతం చేయడం ఎవరి వల్ల కాదన్నారు. రాష్ట్రంలో ఏ సీఎం పడని తిట్లు రేవంత్ రెడ్డి పడుతున్నారన్నారు. 2027 లో కచ్చితంగా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బీగాల గణేష్ గుప్తా మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ విఠల్ రావు, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పిలుపు.**

**కరీంనగర్ లో భారీ సభ ఏర్పాట్లు పరిశీలన.**



**వేగుచుక్క న్యూస్, కరీంనగర్, నవంబర్ 29**

జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించే పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలనీ అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్ఆర్ఆర్ మైదానం సభ స్థలిలో భూమి పూజ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, ఊపాధ్యాయులు, ఎల్ఐసి ఉద్యోగులు, డాక్టర్లు, వివిధ రంగాల ప్రముఖులు, భారీ ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి వెంట వి. రవీందర్ రెడ్డి, ఎర్రం శెట్టి మునిందర్, మహిపాల్ రెడ్డి, యూత్ లీడర్ కోమటిరెడ్డి అశోక్ రెడ్డి, నవీన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కెసిఆర్ ఆనవాళ్లు తీసేయడం ఎవరితరం కాదు : బిఆర్ఎస్ నేత ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్




**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 29:**

తెలంగాణ రాష్ట్రంలో 9 ఏళ్ళ కేసీఆర్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటి గడపలో ఆనవాళ్లు గా ఉన్నాయని, ఆ ఆనవాళ్లను తీసివేయడం ఎవరి తరం కాదని దీక్షా దివస్ కామారెడ్డి ఇంచార్జి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో తెలంగాణ తల్లి, కానిస్టేబుల్ కిష్టయ్య, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాలను పూలమాలలు వేసిన అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం సత్య గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్చార్జి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. ఇప్పుడున్న తరానికి తెలంగాణా చరిత్ర తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. తెలంగాణ తొలి విడుత 1959 లో 369 మంది అమరులైనా తెలంగాణ రాష్ట్రం సిద్ధించలేదని అన్నారు. కానీ కెసిఆర్ దీక్షతో అప్పటి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి రాష్ట్రం సాధించడం జరిగిందని అన్నారు.



# బిజీగా మారిన త్రిష

సినీమాల మీద సినీమాలుబ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న స్టార్ హీరోయిన్లలో టాప్‌లో ఉంటుంది చెన్నై సోయగం త్రిష. ఈ భామ ప్రస్తుతం తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో లీడింగ్ హీరోలతో సినిమాలు చేస్తోంది. త్రిష ఖాతాలో అజిత్ కుమార్ నటిస్తోన్న విదాముయార్చి, చిరంజీవి నటిస్తోన్న విశ్వంభర సినిమాలున్నాయి. దీంతోపాటు మాలీవుడ్ యాక్టర్ టొవినో థామస్ నటిస్తోన్న ప్రాజెక్ట్ కూడా ఉంది. కాగా 2025 జనవరిలో త్రిష అభిమానులు, ఫాలోవర్లకు డబుల్ ట్రీట్ ఇవ్వబోతుందన్న వార్త నెట్టింట రౌండప్ చేస్తోంది. విదాముయార్చి

2025 పొంగళ్ కానుకగా రాబోతున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు టొవినో థామస్ సినిమా కూడా జనవరిలోనే రాబోతుంది. టొవినో థామస్‌తో చేస్తున్న ఐడెంటిటీ మలయాళంలో త్రిష రెండో ప్రాజెక్ట్.ఈ రెండు సినిమాల విడుదల తేదీలపై క్లారిటీ రావాల్సి ఉండగా.. తాజా వార్తల ప్రకారం ఒకేసారి త్రిష డబుల్ ట్రీట్ ఇవ్వబోతుండటం ఖాయమైనట్టే. ఈ లెక్కన త్రిష అభిమానులకు మాత్రం పండగే అని చెప్పాలి. మరోవైపు మోహన్ లాల్‌తో రామ్, అజిత్ కుమార్-అధిక్ రవిచంద్రన్ గుడ్ బ్యాడ్ అగ్లీ ప్రాజెక్ట్, మణిరత్నం-కమల్ హాసన్ థగ్ లైఫ్ సినిమాలు కూడా త్రిష లైన్‌లో ఉన్నాయి.

# గేమ్ ఛేంజర్ నుంచి నాలుగో పాట, ట్రైలర్ ప్లాన్ అదుర్స్



స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం గేమ్‌ఛేంజర్. బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనుండగా.. ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది శంకర్ టీం. గేమ్‌ఛేంజర్ నుంచి తాజాగా లాంచ్ చేసిన మూడో సాంగ్ నానా హైరానా ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ కలర్‌ఫుల్‌గా సాగుతూ విజువల్ ట్రీట్ పక్కా అని చెబుతోంది. మరోవైపు ఇప్పటికే రిలీజ్ చేసిన రా మచ్చ, జరగండి జరగండి సాంగ్‌కు నెట్టింట మంచి స్పందన వస్తోంది. అప్పుడే నాలుగో పాట విడుదలతోపాటు ట్రైలర్ అప్‌డేట్‌కు సంబంధించిన వార్త అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం నాలుగో సింగిల్ డిసెంబర్ రెండోవారంలో రాబోతుంది. జనవరి మొదటివారంలో ట్రైలర్‌ను లాంచ్ చేయబోతున్నారు. నాలుగో పాట రాంచరణ్, అంజలి కాంబినేషన్‌లో వచ్చే మెలోడీ సాంగ్ అని తెలుస్తుండగా.. ఇది ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో రాబోతుందట. అయితే మేకర్స్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తుండగా..ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## పుష్ప-2 నుంచి పీలింగ్స్ సాంగ్
# ప్రోమో రిలీజ్



టాలీవుడ్, పాన్ ఇండియాతో పాటు వరల్డ్ వైడ్‌గా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాంఛైజీ ప్రాజెక్ట్‌లో అల్లు అర్జున్ మరోసారి టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో వరుస అప్‌డేట్‌లను ఇస్తుంది చిత్రబృందం. ఈ మూవీ నుంచి ఇప్పటికే ట్రైలర్‌తో పాటు మూడు పాటలను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా మరో సాంగ్‌ను అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ మూవీ నుంచి పీలింగ్స్ అనే పాట ప్రోమోను పుష్ప టీమ్ తాజాగా విడుదల చేసింది. కొచ్చిలో జరిగిన మూవీ ఈవెంట్‌లో అల్లు అర్జున్ ఈ పాట గురించి అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ప్రోమోను వదిలారు. ఈ పాటలోని పల్లవి లిరిక్స్‌కు సంబంధించి అన్ని భాషల్లోనూ మలయాళంలోనే ఉండనున్నాయి.

# వరుణ్‌తో కలిసి స్టెప్పులేసిన సమంత



టాలీవుడ్ స్టార్ నటి సమంత తాజాగా హిందీ వెబ్‌సిరీస్ 'సిటాడెల్.. హనీ బన్నీ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లో సామ్‌కు జోడీగా బాలీవుడ్ స్టార్ నటుడు వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటించారు. ఈ నెల 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. తాజాగా చిత్రబృందం సిటాడెల్ సక్సెస్ పార్టీని గత రాత్రి ముంబైలో ఘనంగా నిర్వహించింది. ఈ పార్టీలో సామ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వరుణ్ ధావన్ నటిస్తున్న 'బేబీ జాన్' చిత్రం నుంచి ఇటీవలే విడుదలైన 'నైన్ మాటక్క' అనే పాటకు సామ్ కాలు కదిపింది. వరుణ్‌తో కలిసి ఎంతో ఉత్సాహంగా స్టెప్పులేసింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఇక అదే సమయంలో సక్సెస్ పార్టీకి సంబంధించిన కొన్ని ఫొటోలను కూడా సమంత ఇన్‌స్టా వేదికగా పంచుకుంది. ప్రస్తుతం అవి కూడా నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# ఎలాంటి ఉల్లంఘన జరగలేదు : నయన తరుపున లాయర్



'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీ విషయంలో లేడీ సూపర్ స్టార్ నయనతార , తమిళ స్టార్ నటుడు ధనుష్ మధ్య వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. నయన్ డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా 'నేనూ రౌడీనే' మూవీలోని మూడు సెకండ్ల క్లిప్పింగ్‌ను వాడుకున్నారంటూ ధనుష్.. నయన్ దంపతులపై మద్రాసు హైకోర్టులో రెండు రోజుల క్రితం దావా వేశారు. దీనిపై నయన్ తరఫు లాయర్ తాజాగా స్పందించారు. డాక్యుమెంటరీలో ఎలాంటి కాపీరైట్ ఉల్లంఘనా జరగలేదని స్పష్టం చేశారు. డాక్యుమెంటరీలో వినియోగించిన విజువల్స్ సినిమాలోనివి కావని తెలిపారు. అవి బీటీఎస్‌కు సంబంధించినవని స్పష్టం చేశారు. అది వ్యక్తిగత లైబ్రరీలో భాగం అని తెలిపారు. కాబట్టి అది ఉల్లంఘన కిందకు రాదని ఓ ఆంగ్ల మీడియాతో అన్నారు. మరోవైపు ఈ కేసుకు సంబంధించి మద్రాసు హైకోర్టులో తదుపరి విచారణ డిసెంబర్ 2న (సోమవారం) జరగనుంది. కాగా, నయన్.. ధనుష్ మధ్య గతకొంత కాలంగా వార్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. నయనతార పెళ్లితో పాటు ఆమె జర్నీకి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీని రూపొందించింది. ఈ డాక్యుమెంటరీ ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. అయితే, ఈ డాక్యుమెంటరీలో ధనుష్ నిర్మాతగా వ్యవహరించిన 'నేనూ రౌడీనే' మూవీ షూటింగ్ క్లిప్పింగ్స్‌ని వాడుకున్నారు. ఆ క్లిప్పింగ్‌ను డాక్యుమెంటరీలో వాడుకునేందుకు అనుమతి లేకపోవడంతో రూ.10కోట్ల పరిహారం ఇవ్వాలని ధనుష్ డిమాండ్ చేశారు.

# అవును వచ్చే నెలలోనే నా పెళ్లి : కీర్తి సురేష్

గత కొంత కాలంగా జరుగుతున్న పెళ్లి ప్రచారంపై అగ్ర కథానాయిక కీర్తి సురేశ్ తాజాగా స్పందించారు. ఆ వార్తలను నిజం చేస్తూ.. వచ్చే నెలలో తన బాయ్‌ఫ్రెండ్‌ను పెళ్లాడనున్నట్లు స్పష్టం చేశారు.కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కీర్తి సురేశ్ సందర్శించుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి సేవలో పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల కీర్తి సురేశ్ మాట్లాడారు. ఈ మేరకు పెళ్లి వార్తలపై స్పష్టతనిచ్చారు. గోవాలో తన పెళ్లి జరగనున్నట్లు ప్రకటించారు. అందుకే స్వామివారి దర్శనానికి వచ్చినట్లు వెల్లడించారు. మరోవైపు తన రిలేషన్‌షిప్ స్టేటస్‌పై కీర్తి సురేష్ బుధవారం అధికారిక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ప్రియుడు ఆంటోనీతో దీపావళి సందర్భంగా తీసుకున్న ఓ ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. తమ స్నేహబంధం జీవితాంతం కొనసాగనుందని తెలిపింది. ఈ వార్త తెలుసుకున్న పలువురు సినీ సెలబ్రిటీలు కీర్తి సురేష్‌కు శుభాకాంక్షలు అందజేశారు. ఇక రిపోర్ట్స్ ప్రకారం.. డిసెంబర్ 11, 12 తేదీల్లో గ్రాండ్ వెడ్డింగ్ జరగనున్నట్లు తెలిసింది. ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరుకానున్నట్లు సమాచారం.



# తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కీర్తిసురేష్



కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని అగ్ర కథానాయిక కీర్తి సురేశ్ దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో స్వామి వారి సేవలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న నటికి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. కీర్తి త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్నారంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో ఆమె స్వామివారిని దర్శించుకోవడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మరోవైపు తన రిలేషన్‌షిప్ స్టేటస్‌పై కీర్తి సురేష్ బుధవారం అధికారిక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ప్రియుడు ఆంటోనీతో దీపావళి సందర్భంగా తీసుకున్న ఓ ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది.

తమ స్నేహబంధం జీవితాంతం కొనసాగనుందని తెలిపింది. ఈ వార్త తెలుసుకున్న పలువురు సినీ సెలబ్రిటీలు కీర్తి సురేష్‌కు శుభాకాంక్షలు అందజేశారు. వచ్చే నెల వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. డిసెంబర్ 11, 12 తేదీల్లో గోవాలో గ్రాండ్ వెడ్డింగ్ జరగబోతోందంట. ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరుకానున్నట్లు తెలిసింది. అయితే, తమ మధ్య ఉన్న రిలేషన్ షిప్ గురించి ఓపెన్ అయిన కీర్తి సురేశ్.. పెళ్లి గురించి మాత్రం ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.